నేడు మల్కాజిగిరి సర్కిల్ డీసీతో

'సాక్షి' ఫోన్ ఇన్



గోధుమల రాజు, డిప్యూటీ కమిషనర్

మల్కాజిగిరి: డెంగీ,మలేరియా తదితర వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో మల్కాజిగిరి సర్కిల్‌లో వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలపై నేడు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డిప్యూటీ కమిషనర్ రాజుతో 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 91548 99636, 9866342021.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా: రెండ్రోజులు ఎడతెరిపిలేకుండా నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఆయా డివిజన్లలో కార్పొరేటర్లు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ.. అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. వర్షాలతో నాలాలు, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు రావొద్దని అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారులు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయండి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న గౌడ సంఘం సభ్యులు

మల్కాజిగిరి: నేరేడ్‌మెట్‌లో ఉన్న గౌడ శ్మశానవాటిక అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని నేరేడ్‌మెట్ గౌడ సంఘం సభ్యులు మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్‌కు వినతిపత్రం అందజేశారు. కొంతమంది శ్మశానవాటికపై కోర్టుల్లో కేసులు వేశారని జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్‌ను కోరారు. అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని వారికి కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అభిషేక్‌గౌడ్, నరేందర్, పవన్‌కుమార్, వినోద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిమిషాంబదేవికి ప్రత్యేక పూజలు



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి ఆలయంలో శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సౌభాగ్యలక్ష్మి, సుమంగళి లక్ష్మి, కుంకుమార్చన, లక్ష గాజులతో విశేష అలంకరణ మహోత్సవాలు చేశారు. ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శత చండీహోమం



హోమంలో పాల్గొన్న మేయర్, స్థానిక నేతలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 7వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ మాడుగుల చంద్రకళాచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శ్రీషిరిడీసాయి దత్తక్షేత్రం, శతచండీహోమ క్రతువు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌లు హోమంలో పాల్గొన్నారు. కార్పొరేటర్లు, కో– ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్‌లోని విహారికా కాలనీ సి సెక్టార్ సభ్యులు ఆదివారం కాలనీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యవర్గ సమావేశంలో 90మంది కాలనీ సభ్యులు పాల్గొని నూతన అధ్యక్షుడిగా నాయిని రవీందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీవాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌బీకాలనీ నూతన కమిటీ..



కుషాయిగూడ: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ కన్వీనర్‌గా దేవేందర్, కో– కన్వీనర్లుగా కిషోర్, ప్రవీణ్ ఎన్నికయ్యారు. ఆదివారం తిరుమలనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా గౌరి, మహేష్, రాకీ, సుజల్, రాకేష్‌రెడ్డి, అజయ్‌గౌడ్, సాయిచరణ్, జితిన్, శ్రావణ్ కుమార్, సాయికిరణ్‌ను ఎన్నుకున్నారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య, బీజేపీ నేత పూసల బ్రహ్మచారి, డీఎల్. ప్రసాద్, మునిగంటి రామ్ ప్రతీమ్, తిమ్మారెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.



కాలనీల్లో పర్యటిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



సాకేత్ కాలనీలో విరిగిన విద్యుత్ స్తంభాలు



ఎస్పీనగర్‌లో నాలాను పరిశీలిస్తున్న ఏఈ దీపక్

ముసురుకున్న వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం



ఉప్పల్ సర్కిల్‌లో జెడ్సీ హేమంత్ పాటిల్, డీసీ ఆంజనేయులు



అల్వాల్ పోలీస్‌స్టేషన్ వద్ద కూలిన చెట్టు.. తొలగిస్తున్న అధికారులు



వసంతపురి కాలనీలో విరిగిపడ్డ చెట్టు కొమ్మ

విరిగిన చెట్ల కొమ్మలు, నేలకూలిన విద్యుత్ స్తంభాలు

గత రెండ్రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం పలుచోట్ల రోడ్లపైకి వరద నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది కాలనీవాసులతో కలిసి సహాయక చర్యలు చేపట్టి రోడ్లపై కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగింపజేశారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం



కృపా కాంప్లెక్స్ వద్ద మట్టిని తొలగిస్తూ..



చిలుకానగర్‌లో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్



అల్వాల్‌లో కారుపై కూలిన భారీ వృక్షం



ఎర్రకుంట చెరువును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు



పీర్జాదిగూడలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మేయర్ అమర్‌సింగ్

గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీ



సమావేశంలో పాల్గొన్న నూతన కమిటీ



నాచారం నూతన కమిటీ సభ్యులు

రామంతాపూర్ : హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్ల గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్లుగా రావుల బీరప్ప, సోమ శ్రీనివాస్, కో– కన్వీనర్లుగా మేకపోతుల రమేష్, కొత్తపల్లి రమేష్, సీహెచ్. ప్రవీణ్, వీరారెడ్డి, అంజయ్య పటేల్, మహిళా విభాగం కన్వీనర్‌గా సురేఖ, సీహెచ్. ప్రశాంతి, సోషల్ మీడియా ఇన్‌చార్జిలుగా శ్రీనివాస్‌రెడ్డి, సాయినాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు తిండేరు హనుమంతరావు, అధ్యక్షులు రుద్ర వెంకటశేఖర్ వారికి నియామకపత్రాలను అందజేశారు. బాలరాజుయాదవ్, నాగరాజు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాచారం డివిజన్ శాఖ సమావేశం నాచారం డివిజన్ కన్వీనర్ నవీనగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ అసెంబ్లీ కో– కన్వీనర్ గోనే శ్రీకాంత్, కేంద్ర కమిటీ సభ్యులు రమేష్ హాజరై గణేష్ ఉత్సవ సమితి కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కన్వీనర్‌గా శ్రీధర్‌రెడ్డి, కో–కన్వీనర్లుగా మంజులవాణి, గంధమల గోపి, నమిలికొండ సునీల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఆనంద్, నవీన్‌రెడ్డి, బాలు, వాసు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సూదిని రామలింగారెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న ఉప్పల్ పట్టణ ప్రముఖులు

ఉప్పల్: ఉప్పల్ ప్రశాంత్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అధ్యక్షుడు సూదిని రామలింగారెడ్డి(83)కి కాలనీవాసుల పెద్ద ఎత్తున తరలి వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం ఉదయం అనారోగ్యంతో అసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ.. అదే రోజున మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం ఉదయం నాగోల్‌లోని మమతనగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రలో రేవంత్‌రెడ్డి మామ సూదిని పద్మారెడ్డి, ఉప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి, దుబ్బ నర్సింహ్మారెడ్డి, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, మన్నె నర్సింహ్మారెడ్డి, నాంపల్లి మందలం మాజీ జెడ్పీటీసీ ఏబీఎస్‌రెడ్డి, ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణస్వామి, ముత్యంరెడ్డి, సాంబిరెడ్డి తదితరులు హాజరై నివాళులర్పించారు. ప్రశాంత్‌నగర్ ఇతర కాలనీ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు



బీరప్ప దేవాలయంలో..

గౌతంనగర్: శ్రావణమాసం సందర్భంగా మల్కాజిగిరి మండలం పరిధిలోని రామాంజనేయనగర్, అన్నపూర్ణ సొసైటీ తదితర ప్రాంతాల్లో ఆదివారం బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. తెలంగాణ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నపూర్ణలో దోబిఘాట్ వద్ద జరిగిన వేడుకల్లో భక్తులు, వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బీరప్ప బోనాలు..

రామంతాపూర్ : కేసీఆర్‌నగర్‌లోని బీరప్ప దేవాలయంలో ఆదివారం బీరప్ప కామరాతి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు రేవు కృష్ణయ్య, బాలం భిక్షపతి, శాగ రవీందర్, రావుల జంగయ్య, బీరప్ప యాదయ్య, మల్లయ్య, శ్రీశైలం, రేవు నరసింహా పాల్గొన్నారు.

చేనేత వైభవం ప్రతిబింబించేలా 'సఖి' స్టోర్



ప్రారంభిస్తున్న వాసుదేవానంద గిరిస్వామి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఏఎస్.రావు నగర్ వేదికగా చేనేత వైభవాన్ని ప్రతిబింబించే 'సఖి' ది హౌస్ ఆఫ్ కంచి వీవ్స్ స్టోర్‌ను ఆవిష్కరించారు. భారతీయ వారసత్వ వైభవంతో పాటు అధునాతన ఫ్యాషన్ హంగులను నగరవాసులకు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను వాసుదేవానంద గిరిస్వామి ప్రారంభించారు. వ్యవస్థాపక నిర్వాహకులు రావులపల్లి దుర్గా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. హస్తకళా నైపుణ్యంతో పాటు కాలాతీత సౌందర్యానికి నిదర్శనంగా ఈ వస్త్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. సహవ్యవస్థాపకులు రావులపల్లి సాయికృష్ణ, యాంకర్ లాస్య మంజునాథ్, నడుపల్లి నాగశ్రీ, మేఘన రామి తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శిగా రమేష్



ఉప్పల్: సర్వే ఆఫ్ ఇండియా గెజిటెడ్ అధికారుల సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా గోటూరి రమేష్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1767 సంవత్సరంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వంచే స్థాపించబడి ప్రస్తుతం భారత ప్రభుత్వంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖలో కొనసాగుతున్న అతి ప్రాచీన సంస్థ సర్వే ఆఫ్ ఇండియా అని రమేష్ తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తానన్నారు. అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కుషాయిగూడ: కుషాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2001–2002 ఏడాదికి చెందిన టెన్త్‌క్లాస్ విద్యార్థులు ఆదివారం అదే స్కూల్‌లో దాదాపు 23 ఏళ్ల తర్వాత అదే స్కూల్‌లో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను గౌరవించుకుని సన్మానించారు. ఉపాధ్యాయులు బాపురెడ్డి, కృష్ణారెడ్డి, శివశరణ్యప్ప, రామస్వామి, పూర్వ విద్యార్థులు నాగరాజు, భాస్కర్, మురళి, రాజేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మాసశివరాత్రి రుద్రహోమం

గౌతంనగర్: మాసశివరాత్రి సందర్భంగా ఉత్తమ్‌నగర్‌లోని శ్రీ దుర్గా జ్యోతిష్యాలయంలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, రుద్రహోమం, శివుడికి అభిషేకాలు నిర్వహించారు. నిర్వాహకులు మూగు నాగరాజుశర్మ, భక్తులు పాల్గొన్నారు.

నేడు వైఎస్‌ఆర్ వర్ధంతి

అల్వాల్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు తడక జగదీశ్వర్‌గుప్తా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, పేద ప్రజల సంక్షేమం అభ్యున్నతికి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు విశేష సేవలు చేశారన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ, ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీతో పేదలకు మెరుగైన వైద్యం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉమ్మడి రాష్ట్రంలో 86 ప్రాజెక్టులు ప్రారంభించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైఎస్‌ఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు.

మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన



మేడిపల్లి: నిషేధిత మత్తు పదార్థాలు సేవించి యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా తమ విలువైన జీవితాన్ని, కుటుంబాలను నాశనం చేసుకోవద్దని మేడిపల్లి పోలీస్‌స్టేషన్ సీఐ గోవింద రెడ్డి అన్నారు. ఆదివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో జైలు జీవితం గడిపిన సుమారు 30 మందికి వాటివల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. గణపతి, దేవీ నవరాత్రుల సందర్భంగా యువకులు మండపాల వద్ద నిషేధిత మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని, అలాంటి వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని వివరించారు.